కిలో చికెన్ రూ.300

- **చికెన్ బాటలోనే కోడిగుడ్డు**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు కొండెక్కాయి. కొన్ని చోట్ల కిలో చికెన్ ధర ఏకంగా రూ.300 పలుకుతున్నది. ఏటా మహాశివరాత్రి తర్వాత మొదలు కావాల్సిన ఎండలు, ఈసారి ఫిబ్రవరి రెండోవారం నుంచే ప్రారంభమయ్యాయి. దీంతో వేడికి కోళ్లు చనిపోతున్నాయి. మరో పక్క బర్డ్ ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. మార్చి వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. మేడారం మహాజాతర నేపథ్యంలో కోళ్ల దిగుమతిపై తీవ్ర ప్రభావం చూపింది. నష్టాల భయంతో పౌల్ట్రీ వ్యాపారులు కోళ్ల పెంపకాన్ని చాలా వరకు తగ్గించారు. గిట్టుబాటు కాక తల్లికోళ్లను కూడా అమ్మేశారు. ఫలితంగా ఉత్పత్తి తగ్గి, కోళ్లకు కొరత ఏర్పడింది. గత బుధ, గురువారాల్లో కిలో లైవ్ కోడి రూ.150 నుంచి రూ.200 ఉండగా.. ఆది, సోమవారాల్లో అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.300, స్కిన్‌తో రూ.260 వరకు అమ్ముతున్నారు. ఇక బోన్‌లెస్ చికెన్ రికార్డు స్థాయిలో కిలోకు రూ.500కుపైగా విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల వ్యాపారులు సిండికేట్‌గా మారి ఇష్టారీతిన ధరలను నిర్ణయించేస్తున్నారు. కోడిగుడ్డు ధర కూడా రిటేల్ మార్కెట్‌లో ఒక్కోటి రూ.6 పైనే పలుకుతున్నది. పెరిగిన ధరల దృష్ట్యా కొందరు చిల్లర వ్యాపారులు ఇదే అదనుగా.. ఒక్కో గుడ్డు రూ.8 వరకు విక్రయిస్తున్నారు.

దంచికొడుతున్న ఎండలు

మార్చిలో మరింత పెరిగే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి నెల ప్రారంభం కాక ముందే ఎండలు విపరీతంగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. దీంతో 32 నుంచి 37 డిగ్రీ ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వెల్లడించారు. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలుగా నమోదవుతుండటంతో కాస్త చలిగా ఉన్నప్పటికీ పగటి పూట మాత్రం ఎండలు దంచికొడుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశమున్నదని తెలిపారు.

ప్రత్యేక విమానంలో గుండె తరలింపు

- **తిరుపతిలో చికిత్స విజయవంతం**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): అవయవ దానం వల్ల మరొకరికి జీవితం ప్రసాదించవచ్చని మరోమారు నిరూపించారు తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు. వైద్యులు 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్సను పద్మావతి దవాఖానలో విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన కే ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో అక్కడి జెమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఆ యువకుడు బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో వైజాగ్‌కు చెందిన 42 ఏండ్ల వ్యక్తి డైలేటెట్ కార్డియోమయోపతి వ్యాధితో గుండెపోటుకు గురయ్యే స్థితిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చికిత్స పొందుతున్నాడు. అవయవదానం సమాచారం అందుకున్న శ్రీపద్మావతి హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి గుండె మార్పిడికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 26న సాయంత్రం 6 గంటలకు వైద్యబృందం గుండెను సేకరించి ప్రత్యేక ఏర్పాట్లతో శ్రీకాకుళం రాజోలు నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా రోడ్డు మార్గంలో వైజాగ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి 8 గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి రాత్రి 10.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రాత్రి 10.05 గంటలకు బయల్దేరి రాత్రి 10.25 గంటలకు శ్రీపద్మావతి చిన్నపిల్లల దవాఖానకు తరలించి ఈ నెల 27న తెల్లవారుజామున 4 గంటలకు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు.

రేపు ఎమ్మార్పీఎస్ అమరుల దినోత్సవం

టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, ఫిబ్రవరి 28: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నట్టు టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరిస్తూ జిల్లా, మండల కేంద్రాల్లో సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాదిగల న్యాయమైన వాటా కోసం ఉద్యమిస్తూ అమరులైన యువకుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి త్యాగాల వల్లే వర్గీకరణ ఉద్యమం సజీవంగా ఉన్నదని గుర్తు చేశారు. మాదిగల ప్రాణత్యాగాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమరుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించిందని చెప్పారు.

మార్చి 2న బీసీ, అణగారిన వర్గాల ఆత్మగౌరవ సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): బీసీ అణగారిన వర్గాల ఆత్మగౌరవ సదస్సును మార్చి 2న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ బుధవారం వెల్లడించారు. ప్రస్తుత రాజకీయాల్లో సామాజిక న్యాయం క్రమంగా కనుమరుగవుతున్నదని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, న్యాయవాదులు, జర్నలిస్టులు, విద్యార్థి, ఉద్యమ, నాయకులు, వివిధ కులసంఘాల నాయకులు ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చాలని పిలుపునిచ్చారు.

జూలైలో ఇస్టా శతాబ్ది ఉత్సవాలు

అర్జెంటీనా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నిర్ణయం

హైదరబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ విత్తన పరీక్ష అసోసియేషన్ (ఇస్టా) శతాబ్ది ఉత్సవాలను జూలై 1 నుంచి 5 వరకు ఇంగ్లండ్‌లో నిర్వహించనున్నట్టు ఇస్టా అధ్యక్షుడు డాక్టర్ కే కేశవులు తెలిపారు. అంతర్జాతీయంగా ఒకే రకమైన విత్తన పరీక్షాప్రమాణాలను నిర్ణయించడం కోసం 1924లో జ్యూరిచ్ (స్విట్జర్లాండ్)లో ఇష్టా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ ఏడాదితో ఈ సంస్థ ఏర్పాటై వందేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలోనే శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో 11 ఎకో టూరిజం ప్రాజెక్టులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 11 ప్రదేశాల్లో పర్యావరణ పర్యాటక ప్రాజెక్టు (ఎకో టూరిజం)లను అభివృద్ధి చేయడానికి తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎఫ్‌డీసీ) ప్రణాళికలు రూపొందించింది. డెక్కన్ ఫుడ్స్ అండ్ ట్రైల్స్ థీమ్ కింద ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. పర్యాటకులు అటవీ, వన్యప్రాణులను ఆస్వాదించడానికి సౌకర్యవంతమైన వసతి, రవాణా సౌకర్యాలను ఈ ప్రాజెక్టుల ద్వారా సమకూరుస్తారు. ఈ మేరకు అనంతగిరి హిల్స్, వికారాబాద్, మంజీరా, సంగారెడ్డి, కనకగిరి హిల్స్, ఖమ్మం, గాజీబిడెం, వైజాగ్ కాలనీ, నల్లగొండ, నందిపేట, నిజామాబాద్‌ను టీఎస్ఎఫ్‌డీసీ గుర్తించింది. పర్యావరణ వ్యవస్థల చుట్టూ నివసించే ప్రజలకు జీవనోపాధిని అందించడం, వన్యప్రాణులు, అటవీ ప్రాంతాల రక్షణకు నేరుగా సహకరించడం ఈ ప్రాజెక్టుల ముఖ్యోద్దేశం.

రేపట్నుంచి ఎండో మెట్రియోసిస్‌పై ప్యానల్ డిస్కషన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): పది మంది మహిళల్లో ఒకరు ఎండో మెట్రియోసిస్ వ్యాధి బారినపడుతున్నారని ఎండో మెట్రియోసిస్ ఫౌండేషన్ పేర్కొన్నది. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రేపట్నుంచి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ డాక్టర్ విమీ బింద్రా తెలిపారు. మార్చి 1 నుంచి 3 వరకు సెషన్ల వారీగా వ్యాధి లక్షణాలు గుర్తించడం, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు, రోబోటిక్ సర్జరీలు తదితర అంశాలపై వైద్య నిపుణులు చర్చించనున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖాన, బేగంపేటలోని మారీగోల్డ్ హోటల్‌లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. వర్క్‌షాప్ చివరి రోజు మార్చి 3న నెక్లెస్ రోడ్డులో ఉదయం 6 గంటలకు 'ఎల్లో రిబ్బన్ రన్' ఏర్పాటుచేయనున్నామని తెలిపారు.

పోలీసు శాఖకు 50 బ్రీత్ అనలైజర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీసు శాఖకు 50 బ్రీత్ అనలైజర్లను డయోజియో కంపెనీ అందించింది. డీజీపీ కార్యాలయంలో బుధవారం ఈ బ్రీత్ అనలైజర్లను డీజీపీ రవిగుప్తా, రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ అదనపు డీజీ మహేశ్ ఎం భగవత్‌లకు డయోజియో కంపెనీ కార్పొరేట్ ఎఫైర్స్ సీనియర్ జనరల్ మేనేజర్ రవి వర్మ, క్లస్టర్ సేల్స్ హెడ్ సీజీఎం అశ్వాంత్ బైసాని, మాన్యుఫాక్చరింగ్ జీఎం కే జైకృష్ణ, సీఎస్ఆర్ ప్రోగ్రాం అసోసియేట్ మేనేజర్ రజిత సరోహా తదితరులు అందించారు.

4,5 తేదీల్లో మోదీ పర్యటన

ఆదిలాబాద్, సంగారెడ్డిలో బహిరంగసభలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ వచ్చే నెల 4,5 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతోపాటు ఆదిలాబాద్, సంగారెడ్డిలో నిర్వహించనున్న బహిరంగసభల్లో పాల్గొంటారు. 4న ఉదయం 9:20 గంటలకు నాగపూర్ నుంచి బయలుదేరి ఉదయం 10:20 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటారు. అక్కడ శంకుస్థాపనల అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. తర్వాత మహారాష్ట్రలోని నాందేడ్‌కు చేరుకొని, అక్కడి నుంచి తమిళనాడు పర్యటనకు వెళ్తారు. తిరిగి రాత్రి 8 గంటలకు హైదరాబాద్‌కు చేరుకొని, రాజ్‌భవన్‌లో ఆ రాత్రి బస చేస్తారు. 5న ఉదయం సంగారెడ్డికి చేరుకొని అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 11:30 గంటలకు సంగారెడ్డిలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:40 గంటలకు బేగంపేట నుంచి ఒడిశా పర్యటనకు వెళ్లనున్నారు.

ట్రిపుల్‌ఆర్ లోపలంతా హెచ్‌ఎండీఏ

- ఆ ప్రాంతమంతా ఒకే యూనిట్‌గా అభివృద్ధి చేయాలి
- ఓఆర్ఆర్ లోపలి ప్రాంతమంతా మరో యూనిట్
- హైదరాబాద్ మహానగర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్-2050
- ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్‌కు రేడియల్ రోడ్లు
- హెచ్‌ఎండీఏ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హెచ్‌ఎండీఏ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై సమగ్ర విచారణ

ఔటర్ రింగు రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఆ బాధ్యతలను హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ అమ్రపాలికి అప్పగించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీ గండి పడేలా తక్కువ రేటుకు టెండర్లు కట్టబెట్టారని ఆయన ఆరోపిస్తూ.. కనీస ధర నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారని హెచ్‌ఎండీఏ అధికారులను ప్రశ్నించారు. టెండర్లకు ముందు ఓఆర్ఆర్‌పై ఏటా రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని అధికారులు వివరించారు. దీంతో 30 ఏండ్లలో ప్రభుత్వానికి రూ.18 వేల కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7,380 కోట్లకు ఐఆర్‌బీ కంపెనీకి ఎలా అప్పగించారని సీఎం ఆరా తీశారు. హెచ్‌ఎండీఏ అనుసరించిన టెండర్ విధానం వల్ల రూ.15 వేల కోట్లకుపైగా నష్టపోయిందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ వ్యవహారంపై విచారణ నివేదిక అందిన తర్వాత క్యాబినెట్‌లో చర్చించి సీబీఐ దర్యాప్తునకు అప్పగిస్తామని సీఎం తెలిపారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగర అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్‌తో విజన్ డాక్యుమెంట్-2050ని రూపొందించాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న ప్రాంతాన్ని ఓ యూనిట్‌గా, ఓఆర్ఆర్-రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ఆర్) మధ్య ఉన్న ప్రాంతాన్ని మరో యూనిట్‌గా తీసుకొని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తేవాలని అన్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన సిటీతోపాటు ఆ చుట్టుపక్కల కొత్తగా విస్తరిస్తున్న మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతమివ్వాలని సూచించారు. సచివాలయంలో బుధవారం ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎండీఏలో కీలక విభాగాలైన పట్టణ ప్రణాళిక (ప్లానింగ్), ఇంజినీరింగ్, ఓఆర్ఆర్, ఉమ్మా, లేక్ ప్రొటెక్షన్, ల్యాండ్ పూలింగ్ స్కీం, ఎస్టేట్ విభాగం అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్ వరకు రేడియల్ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

చెరువులు, కుంటలను కాపాడాలి

హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని, మరోవైపు ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌తోపాటు అక్కడి స్థలాల అభివృద్ధి కోసం అవసరమైతే జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 8,371 ఎకరాల ల్యాండ్ పార్సిళ్లు ఉన్నాయని, వాటిలో 2,031 పార్సిళ్లు కోర్టు కేసుల్లో మగ్గుతున్నాయని తెలిపారు. హెచ్‌ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు డిజిటల్, జీపీఎస్ విధానాలతో మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న స్థలాలతో ఆదాయాన్ని పెంచుకునే చర్యలు చేపట్టాలని, వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టి పెట్టాలని అన్నారు. ల్యాండ్ పార్సిల్స్, చెరువులు, కుంటలు అక్రమణలకు గురి కాకుండా చూసేందుకు ప్రత్యేకంగా డీఐజీ స్థాయిలో ఓ ఐపీఎస్ అధికారిని నియమించడంతోపాటు ఎస్పీ ర్యాంకు ఉన్న ఇద్దరు అధికారులకు బాధ్యతలు అప్పగించాలని తెలిపారు.

కమ్యూనిటీ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు

హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్ తదితర పట్టణాల్లోని లేఅవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాల్లో ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఆ స్థలాలను ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్ కంపెనీలు, పేరొందిన పాఠశాలల యాజమాన్యాలకు అప్పగించాలని సూచించారు. ఆ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కనీసం 25% అడ్మిషన్లు దక్కేలా చూడాలని స్పష్టం చేశారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలను అందమైన, ఆహ్లాదకరమైన జోన్లుగా తీర్చిదిద్దాలన్నారు. ఆ ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి దుబాయ్ తరహాలో స్కైవాక్ వే, ఫుడ్ స్టాళ్లు, పిల్లల పార్కులు, అమ్యూజ్‌మెంట్ జోన్, గ్రీనరీ ల్యాండ్‌స్కేపింగ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ అమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

రాజా, రాధారెడ్డిలకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్

న్యూఢిల్లీ: ప్రసిద్ధ కూచిపూడి కళాకారులు రాజారెడ్డి, రాధారెడ్డిలను అకాడమీ రత్నలుగా సంగీత నాటక అకాడమీ ఎంపిక చేసింది. 2022, 2023 సంవత్సరాలకు గానూ ఆరుగురికి ఫెలోషిప్ (అకాడమీ రత్న), 92 మందికి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందచేయనున్నట్టు అకాడమీ ప్రకటించింది. రాజారెడ్డి, రాధారెడ్డితో పాటు జానపద కళాకారుడు, రచయిత వినాయక్ ఖేదేకర్, వైణిక విద్వాంసుడు ఆర్ విశ్వేశ్వరన్, కథక్ నృత్య కళాకారిణి సునయన హజారీలాల్, రంగస్థల దర్శకుడు దులాల్ రాయ్, ప్లే రైట్ డీపీ సిన్హాలకు కూడా అకాడమీ ఫెలోషిప్ దక్కింది. ఫెలోషిప్ పొందిన వారికి రూ.3 లక్షల బహుమతి ఇవ్వనుండగా.. అకాడమీ పురస్కారం పొందిన వారికి రూ.లక్ష బహుమతిని ఇస్తారు. ఈ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓ ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నారు. 2022, 2023 సంవత్సరాలకు గానూ ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలకు 80 మందిని అకాడమీ ఎంపిక చేసింది. వీరిలో ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున బహుమతి ఇస్తారు. యువ పురస్కారాలను సంగీత్ నాటక అకాడమీ చైర్మన్ అందజేస్తారు.

గంగాధర శాస్త్రికి సంగీత నాటక అకాడమీ అవార్డు

న్యూఢిల్లీ: ప్రసిద్ధ గాయకుడు, భగవద్గీత గాన, ప్రవచన, ప్రచార కర్త, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎల్‌వీ గంగాధరశాస్త్రికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. 2023 ఏడాదికిగానూ ఇతర ప్రధాన సంప్రదాయ సంగీత విభాగంలో ఆయనకు ఈ పురస్కారం దక్కింది. తాను అభ్యసించిన కర్ణాటక శాస్త్రీయ సంగీతంతో భగవద్గీతలోని 700 శ్లోకాలలో ఘంటసాల స్వరపరచి పాడిన 108 శ్లోకాలను ఆయన గౌరవార్థం గంగాధర శాస్త్రి యథాతథంగా పాడారు. అంతేకాదు, మిగిలిన 594 శ్లోకాలను స్వీయ సంగీతంలో, తెలుగు తాత్పర్య సహితంగా గానం చేశారు. గతంలో గంగాధర శాస్త్రిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న(హంస) పురస్కారంతో, మధ్యప్రదేశ్‌లోని మహర్షి పాణిని యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి. అవార్డును ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు గంగాధర శాస్త్రి పేర్కొన్నారు. అలాగే సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య పురేచాతోపాటు జ్యూరీ సభ్యులకు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్వేతాప్రసాద్‌కు బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం

శ్వేతా ప్రసాద్

అబిడ్స్, ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి శ్వేతాప్రసాద్ 2022-23 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్‌కు ఎంపికయ్యారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఈ అవార్డును బుధవారం న్యూఢిల్లీలో ప్రకటించింది. సంగీత విభాగం కర్ణాటక మ్యూజిక్‌లో తెలంగాణ నుంచి శ్వేతాప్రసాద్‌ను ఎంపిక చేశారు. శ్వేతాప్రసాద్ ప్రపంచవ్యాప్తంగా మూడు దశాబ్దాలుగా రెండు వేలకుపైగా గాత్ర ప్రదర్శనలు నిర్వహించారు. అన్నమాచార్య కృతులు, త్యాగరాజ కీర్తనలతో ప్రదర్శనలు ఇచ్చారు. దేశ విదేశాల్లో భరతనాట్యం, ఆంధ్రనాట్యం కూచిపూడి విభాగాల్లో ప్రముఖ నాట్య కళాకారులకు గాత్రం, నట్టువాంగ సహకారం అందించారు. పలు నృత్య ప్రదర్శనలకు స్వరకల్పన చేశారు. అమెరికా, చైనా, మలేషియా, టర్కీ, సిరియా, వియత్నాం దేశాల్లో భారత సాంస్కృతిక మండలి తరపున పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటుడు రక్త కన్నీరు నాగభూషణం మనవరాలైన శ్వేతాప్రసాద్ నాలుగేండ్ల ప్రాయంలోనే సంగీతం అభ్యసించారు. కర్ణాటక వోకల్, లలిత సంగీతంలో ఆకాశవాణి ఏ-గ్రేడ్ కళాకారిణి అయిన శ్వేతాప్రసాద్ ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో ఎంఫిల్ చేస్తున్నారు.

త్వరలో రాష్ట్ర ప్రభుత్వంలో తిరుగుబాటు

మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తుమ్మితే ఊడిపోయే ముక్కులాగా 64 మంది ఎమ్మెల్యేలే ఉన్నారని గుర్తుచేశారు. ఎన్నికల ఫలితాల తరువాత కర్ణాటక అవుతుందో, హిమాచల్ అవుతుందో చూద్దామని పేర్కొన్నారు. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారని, మంత్రులు తిరుగుబాటు చేస్తున్నారని చెప్పారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. అమలు చేయలేని హామీలతో కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని, అవి అమలు కాకపోవడంతో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు తిరుగుబాటు చేస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలోనూ ఇలాంటి పరిస్థితే వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కు మాదిరిగా ఉన్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ నేతలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయని, మంత్రులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రుల వ్యవహారశైలి, హామీల అమలు, రాష్ట్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రభుత్వం పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నదని విమర్శించారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందంటూనే అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హామీలన్నీ నెరవేర్చాలంటే బడ్జెట్‌కు అదనంగా రూ.1.53 లక్షల కోట్లు అవసరమని చెప్పారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి.. ఇప్పుడు షరతులు విధిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకను వాడుకున్నదని, ఇప్పుడు దేశం మొత్తం ఎన్నికలకు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు.

సిరిసిల్లలో 'నేతన్నల ఆకలికేక'

- వస్త్రపరిశ్రమను రక్షించాలని ధర్నా
- బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలి
- బకాయిలు, సబ్సిడీలు చెల్లించాలి
- కార్మికులు, ఆసాముల డిమాండ్

రాజన్నసిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): సాంచాలలో నెలకొన్న సంక్షోభాన్ని తొలగించాలని, తమకు చేతినిండా పనికల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు రోడ్డెక్కారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 'నేతన్నల ఆకలి కేక' పేరిట సిరిసిల్లలో మహాధర్నా నిర్వహించారు. వందలాది మంది నేత కార్మికులు ర్యాలీ తీశారు. నిరుడు ఇచ్చిన బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.482 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి చేతినిండా పనికల్పించాలని నేతన్నలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్